

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిజాయతీగా చేపట్టాలి
- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కారించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 114 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింది అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గ దర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే కోసం ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల కార్యదర్శుల సర్వే సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎలాంటి వివాదాలు, అవకతవకలకు తావు లేకుండా సర్వే ప్రక్రియను నిజాయితీగా, నిబద్ధతతో చేపడుతూ గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ప్రజావాణిలో 94 ఫిర్యాదులు

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి అందించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రజావాణిలో 94 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్‌కుమార్ పాల్గొన్నారు.



రూఫ్‌ఖాన్‌పేట్‌లో తవ్వకాలు ఇలా..

రంగాపూర్‌లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

తోడేస్తున్నారు!

అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో తవ్వుకున్నోళ్లకు తవ్వుకన్నంత మట్టి అన్న చందంగా సాగుతోంది అక్రమ వ్యాపారం. గోరంతకు అనుమతులు తీసుకొని కొండంత కొల్లగొడుతున్నారు. దీంతో గుట్టలు, కొండలు మాయం అవుతున్నాయి. రాత్రింబవళ్లు యథేచ్ఛగా రవాణా సాగిస్తూ రూ.కోట్లు వెనుకేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. పరిగి ప్రాంతంలో జరుగుతున్న 'మట్టిదందా'పై కథనం.

పరిగిలో యథేచ్ఛగా మట్టిదందా!

- అనుమతి గోరంత.. తవ్వకాలు కొండంత
- కరుగుతున్న గుట్టలు, కొండలు
- రాత్రింబవళ్లు యథేచ్ఛగా సాగుతున్న రవాణా
- అక్రమ వ్యాపారులకు అధికారుల వత్తాసు
- అధికార పార్టీ నేతల అండదండలు సైతం

పరిగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మట్టే కదా? ఏం చేసుకుంటారని అనుకోవచ్చు. అలా అనుకుంటే పొరపాటే మరి. ఆ మట్టితో కోట్ల రూపాయల్లో వ్యాపారం జరుగుతోంది. పరిగి మండలంలో అక్రమంగా రాత్రింబవళ్ల తవ్వకాలు జరిపి సొరంగాలుగా మారుస్తున్నారు. భయంకరమైన లోతులో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ తవ్వకాలు కూడా ప్రభుత్వ,ప్రైవేట్ భూముల్లో జరుపుతుండటం గమనార్హం. ఈ మట్టిని నిబంధనలకు విరుద్ధంగా లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి ఆదాయం కల్పించే ఈ మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారం మాదే.. మమ్మల్ని అడ్డుకునేది ఎవరనే ధీమాతో వ్యాపారాన్ని సాగిస్తున్నారు పలువురు వ్యాపారులు. నామ్‌కేవాస్తే నాలుగైదు ఎకరాల అనుమతి పొంది వందల ఎకరాల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ,పోలీసు, మైనింగ్ శాఖ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై మట్టి తరలింపును నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. అధికారులంతా అధికార పార్టీ నేతల చేసే వ్యాపారానికి వత్తాసు పలుకున్నారు.

మెండుగా ఆదాయం

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు ఇక్కడి రెవెన్యూ అధికారులకు అక్రమ ఆదాయాన్ని

- మిగతా 8వ పేజీలో..



సత్యనారాయణను పరామర్శిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కార్యకర్తలకు అండగా బీజేపీ

నాగారంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కీసర రూరల్, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్తకు బీజేపీ అండగా ఉంటుందని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో నివసముంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు సత్యనారాయణను కలిశారు. 97సంవత్సరాల వయస్సున్న ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత 40 సంవత్సరాలుగా బీజేపీలో కొనసాగుతున్న సత్యనారాయణ తనకు చిరకాల మిత్రుడని, అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు నాగారం విచ్చేసినట్లు ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటాం

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ రహదారి విస్తరణలో ఇళ్లను, స్థలాలను కోల్పోతున్న వారికి న్యాయమైన నష్టపరిహారాన్ని అందజేస్తామని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా భూసేకరణ సబ్ కలెక్టర్ శంకర్ కుమార్ బాధితులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం శామీర్‌పేట మండలం తూంకుంటలో బాధితులను కలసి వారి ఇళ్ల దస్తావేజులు, రేషన్ కార్డులు, ఐడీ కార్డులను, ఓటర్ కార్డులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భూసేకరణకు కావాల్సిన ఆధారాలను, పలు రికార్డులను, సర్టిఫికెట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి విచారణ జరిపారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణ కోసం అవసరమైయిన స్థలాలను కేటాంచాలించే భూ సేకరణ చేస్తున్నామని, అందుకు స్థలాలను కోల్పోతున్న వారు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి

- లీడ్ బ్యాంక్ జిల్లా అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి
- బొమ్మరాసిపేటలో రైతులకు అవగాహన



7

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- శ్రద్ధతో పరీక్షలకు సిద్ధం కావాలి
- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



7

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- 20 ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్‌లో సేవలు
- రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలి



8



ధ్యాన మహాయాగం వేడుకలో అభ్యాసకులు, (ఇన్‌సెట్‌లో) విదేశీ మహిళ

ధ్యానంతో ఆత్మజ్ఞానం

- ధ్యాన గురువు పరిణతి పత్రీజీ
- కొనసాగుతున్న ధ్యాన మహాయాగం వేడుకలు
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న ధ్యానులు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు
- ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

కడ్తాల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ధ్యాన సాధన చేసి ఆత్మజ్ఞానం పొందిన వారు మానసిక భయాలు వీడి మనో ధైర్యంతో ఆనందమయ జీవితాన్ని పొందుతారని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, దివంగత బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ కుమార్తె పరిణతి పత్రీజీ అన్నారు. శ్వాస మీద ధ్యాసతోనే వ్యక్తికి పరిపూర్ణత లభిస్తుందని.. అది ధ్యానం ద్వారా సిద్ధిస్తుందని తెలిపారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి మహేశ్వర మహాపిరమిడ్‌లో కొనసాగుతున్న ధ్యాన మహాయాగం వేడుకల్లో భాగంగా మూడోరోజు సోమవారం పరిణతి పత్రీజీ పాల్గొని ధ్యానులనుద్దేశించి మాట్లాడారు. పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యానం ద్వారా జ్ఞానం, సంస్కారం సిద్ధించి వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ కేంద్రంగా పత్రీజీ ప్రారంభించిన ధ్యాన విప్లవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

అట్టహాసంగా వేడుకలు

అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు-3 అట్టహాసంగా



కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వేడుకలకు ధ్యానులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మికవేత్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పలు దేశాలకు చెందిన ధ్యానులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని తమ ధ్యాన అనుభవాలను వివరిస్తున్నారు. పత్రీజీ శక్తిస్థల్‌ను శోభాయమానంగా అలంకరించారు. ధ్యాన మహాయాగంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 5గంటలకు ధ్యాన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం యోగా మాస్టర్ వెంకటేశ్‌చే యోగా శిక్షణ, చైతన్య తేజల ఆధ్వర్యంలో వేద పఠనం, వేణునాథ, సంగీత కళాకారులు గణేశ్, సంజయ్‌కింగ్ బృందాలచే సంగీతనాద ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. ధ్యాన గురువు పత్రీజీ వేణునాధ సంగీత ధ్యాన వీడియోలను సరస్వతి ప్రాంగణంలోని సభావేదికపై నుంచి వీడియో ద్వారా ప్రదర్శించారు. సంగీత విద్వాంసుల సంగీత ధ్యానం అమితంగా ఆకట్టుకుంది. పలువురు పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మికవేత్తలు, ట్రస్ట్ సభ్యులు ధ్యానులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా

- మిగతా 7వ పేజీలో..

ప్రజాభీష్టం మేరకే భూసేకరణ జరగాలి

పాలమూరు ఎంపీ డీకే అరుణ



రైతులతో మాట్లాడుతున్న డీకే అరుణ

బొంరాస్‌పేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను గౌరవించి ప్రజాభీష్టం మేరకే భూములను సేకరించాలని పాలమూరు ఎంపీ డీకే.అరుణ అన్నారు. ఆమె సోమవారం లగచర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లగచర్ల ఘటన తీవ్ర ఆవేదనను కలిగించిందన్నారు. మారుమూల గ్రామాల్లో ఫార్మా పెడితే ఇక్కడి ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. ఓ ప్రైవేట్ కంపెనీ కోసం అమాయక రైతులను ఇబ్బందులకు గురి చేస్తుంటే కన్నీళ్లు వచ్చాయన్నారు. అరెస్టయిన వారిలో మొత్తం 57 మందిలో 24 మంది విడుదలయ్యారని, మరో 15 మందికి కూడా బెయిలు వచ్చేలా కృషి చేస్తానని ఆమె వారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. తన నియోజకవర్గంలో ప్రజల దగ్గరికి రానివ్వకుండా అడ్డుకోవడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, బంటు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

దోమ/కులకచర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో సోమవారం పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జి నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, షీ టీం 181, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు, బాల కార్మికవ్యవస్థ, కమ్యూనిటీ పోలిసింగ్, మానవ అక్రమ రవాణా, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సైబర్ నేరాలు, 1930 తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



భూ బాధితులతో మాట్లాడుతున్న కీసర ఆర్డీవో సైదులు

భూ బాధితులకు న్యాయం చేస్తాం

- రైల్వే వంతెన నిర్మాణానికి సహకరించాలి
- కీసర ఆర్డీవో సైదులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైల్వేవంతెన భూబాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నట్లు కీసర ఆర్డీవో సైదులు తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వంతెన భూబాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా నిలిచిపోయిన వంతెన నిర్మాణానికి సహకరించాలని కోరారు. 102 మంది బాధితుల్లో 25 మంది పరిహారం తీసుకున్నారని తెలిపారు. మిగతా వారికి రావాల్సిన పరిహారాన్ని న్యాయస్థానంలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఆ డబ్బులను తీసుకొని వంతెన నిర్మాణానికి సహకరించాలన్నారు. లేదంటే చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ)ను సంప్రదించాలని కోరారు. 2013 చట్టం ప్రకారం మూడింతల పరిహారం అందించాలని, లేదంటే గజానికి రూ.30 వేలు, 60 గజాల స్థలం, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బాధితులు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగ య్యయాదవ్, బీబ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్లు భాస్కర్‌రెడ్డి, రాజేందర్, భూబాధితులు తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద..



విద్యుత్‌దీపాల వెలుగుల్లో మేరీ మాత చర్చి

చర్చిలు ముస్తాబు

క్రిస్మస్‌కు భారీగా ఏర్పాట్లు

ఘట్‌కేసర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రేపు క్రిస్మస్ పండగ సందర్భంగా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలోని చర్చిలను సుందరంగా అలంకరించారు. రెండు రోజులుగా చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక మేరీమాత చర్చిలో పశువుల పాకను ఏర్పాటు చేసి అందులో ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలియజేసే బొమ్మలను ఏర్పాటు చేశారు. నేటి అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు భారీగా ఏరాట్లు చేశారు. ఇందుకోసం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చర్చిల ప్రతినిధులు తెలిపారు.

53వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి వాసులు చేస్తున్న రిలే నిరహార దీక్షలు సోమవారంతో 53వ రోజుకు చేరాయి. జేఏసీ ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్సులపల్లి తండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీ తండాలతో గట్టిప్పలపల్లిని మండల కేం ద్రం చేయాలని వారు డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రం తమకు దూరంగా ఉందని, వచ్చీ పోయేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం కొత్త మండలాన్ని వెంటనే ప్రకటించాలని ప్రజలు, నాయకులు డిమాండ్ చేశారు. దీక్షలో ఆంజనేయులు, ఈదమయ్య, జంగయ్య, చెన్నయ్య, నాగయ్య, చంద్రయ్య కూర్చున్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- రేపు స్వామివారి కల్యాణం.. ఎల్లుండి రథోత్సవం
- కేశంపేట మండలం వేముల్‌నర్వ శివారు నంబయ్య గట్టుపై ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

కేశంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారు నంబయ్య గట్టుపై వెలసిన వేణుగోపాల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేడు(మంగళవారం) ఆలయంలో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ప్రతీయేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వైద్యసేవలు అందించనున్నారు. పోలీసులు సీసీ కెమెరాలతో ఉత్సవాలను పర్యవేక్షించనున్నారు. కేశంపేట సీఐ నరహరి నేతృత్వంలో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని గట్టు కింద ఇప్పటికే మిఠాయి, ఇతర దుకాణాలు వెలిశాయి. రేపటి(మంగళవారం) నుంచి శనివారం వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం రాధారుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం, గురువారం తెల్లవారుజామున గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు రథోత్సవం, శుక్రవారం ప్రభల మహోత్సవం, శనివారం చక్రతీర్థం, స్వామి అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కల్యాణానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరువుతారని తెలిపారు. ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఘనంగా రైతు దినోత్సవాలు



ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ యాట గీత ఆధ్వర్యంలో రైతులు, కమిటీ డైరెక్టర్లు కేక్ కట్‌చేసి పంచారు. కాంగ్రెస్ పాలన అంటేనే రైతు సంక్షేమ పాలన అన్నారు. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ చేసి వారి ఆర్థిక భారాన్ని దించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, రమేశ్ గౌడ్, సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, శ్రీకాంత్, శ్రీను పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రోత్సాహం అభినందనీయం



మేడ్చల్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ఆటల పోటీలు నిర్వహించి క్రీడల్లో ప్రోత్సహించడం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సైబర్ హకాడ్ కాలనీలో సొసైటీ వారు గత 45 రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. 45రోజుల పాటు కాలనీ వాసులు ఆటల పోటీలు నిర్వహించి ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారన్నారు. చాలా వరకు గేటెడ్ కమ్యూనిటీల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అరుదన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, స్థానిక కౌన్సిలర్ అమరం సరస్వతి, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు



పనుల నేపథ్యంలో యాంగ్లర్స్‌పై ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తూర్‌లోని పోచమ్మ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులను ప్రారంభించారు. 'కంచె లేక ప్రాణాలు హరీ' అనే శీర్షికతో ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులోనే ఉండడంతో ఎప్పుడు షాక్ కొడుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు పెంచేందుకు పనులు చేపట్టారు. దీనిపై ఏఈ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తును ఆరుఫీట్లకు పెంచుతున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో గద్దె కట్టడం పూర్తి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను దానిపైన ఫిక్స్ చేస్తామని చెప్పారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో , ఎడ్యునెట్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎస్ఏపీ ల్యాబ్స్ ఉన్నతి కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. హైదరాబాద్‌లోని 200కళాశాలలుండగా సంస్కృతి కళాశాలలో ఈకేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేయడం పట్ల కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యునెట్ ప్రోగ్రామ్ మేనేజర్ మొహ్మద్ పాషా, టాస్క్ రిలేషన్ మేనేజర్ నరేష్, ఆయా విభాగాల ప్రిన్సిపల్స్ జానకిరాములు, శివకేశవరెడ్డి, శశిధర్, అరుణ్‌రెడ్డి పోతిరెడ్డి, నీలంసింగ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల రాత పరీక్షను రద్దు చేయాలి

తాండూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాత పరీక్షను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీఐటీయూ



ప్రారంభోత్సవంలో టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి విద్యార్థులు

ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. 30సంవత్సరాల నుంచి గ్రామాల్లో, పీహెచ్‌సీలో, ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రింబవళ్లు చాలీచాలని జీతాలతో పనిచేస్తే రాత పరీక్ష ద్వారా సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని అనడమేంటని వాపోయారు. రాతపరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రాత పరీక్షలు వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. లేదంటే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లీలావతి, కార్యదర్శి వెంకటమ్మ, కమిటీ సభ్యులు మల్లమ్మ, వైదేవి, పుష్ప, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మందాకు పరామర్శ



మందా జగన్నాథాన్ని పరామర్శిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య పరామర్శించారు. జగన్నాథం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఆసుపత్రిలో వారు పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మందా జగన్నాథం కూతురు పల్లవితో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించారు.

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో క్షేమంగా తల్లీబిడ్డతో కుటుంబీకులు, వైద్య సిబ్బంది

బషీరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన మండలంలోని మర్పల్లి శివారులో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని ఇస్మాయిల్‌పూర్ తండాకు చెందిన జ్యోతిబాయికి పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. అంబులెన్స్‌లో తాండూరులోని మాతా శిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మర్పల్లి శివారులోకి రాగానే నొప్పులు అధికమయ్యాయి. పైలట్ మహేష్ వాహనాన్ని నిలపడంతో ఈఎంటీ నర్సింహులు డెలివరీ చేశారు. కాగా పుట్టిన బిడ్డ మెడకు బొడ్డుతాడు చుట్టి అడ్డుగా వచ్చి డెలివరీ క్రిటికల్‌గా మారగా వైద్యుల సూచన మేరకు ఈఎంటీ చాకచక్యంగా వ్యవహరిస్తూ డెలివరీని విజయవంతం చేశారు. తల్లి, బిడ్డా క్షేమంగా ఉన్నారని వారన్నారు.

సైన్స్‌ఫేర్‌తో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీత



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి వస్తుందని, వారి మేధస్సు పెంపొందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కె.యాదయ్య అన్నారు. నాగర్‌గూడలోని అక్షర టాలెంట్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫేర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవుడి బుద్ధి వికాసానికి విజ్ఞానశాస్త్రమన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్,పాఠశాల కరస్పాండెంట్ రాజుగౌడ్, మాజీ ఎంపీటీసీలు మద్దూరి పాండు, చెన్నయ్య, అశోక్, నాయకులు చేవెళ్ల స్వామి, రాఘవేందర్, కృష్ణగౌడ్, మహేందర్‌గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక శబ్దం వస్తున్న క్రషర్‌ను మూయించాలి

కేశంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేముల్‌నర్వ, దత్తాయపల్లి, ఇప్పలపల్లి గ్రామాల శివారుల్లో ఉన్న క్రషర్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ మీర్ ఆజం అలీ, కేశంపేట సీఐ నరహరిలకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. క్రషర్‌లో బ్లాస్టింగ్ సమయంలో అధిక శబ్దం, దుర్వాసన వస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్వాసన, శబ్దంతో గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. క్రషర్‌ను మూసేయించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, రాజేష్, ప్రవీణ్, నరేష్, రాజు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం

నందిగామ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం బండకుంట తండాలో గృహలక్ష్మి సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు మంజూరు చేయాలని ఎవరికీ లంచాలివ్వొద్దని, ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే వెంటనే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన తర్వాతే ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జె.నర్సింహులు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, బాలరాజు, నర్సింహులు పాల్గొన్నారు.



గృహలక్ష్మి సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించాలి

షాద్‌నగర్: విద్యుత్ సరఫరాలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే శంకర్ ట్రాన్స్‌కో అధికారులకు చెప్పారు. క్యాంప్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు త్రీఫేజ్ కరెంటు లోఓల్టేజీ లేకుండా చూడాలన్నారు. గృహ వినియోగదారులకూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాన్నారు. ఆరు మండలాల్లో విద్యుత్ పరికరాలు అవసరముంటే వెంటనే తనకు చెప్పాలన్నారు. ఎలాంటి పరికారలైనా వెంటనే సమకూర్చుతామన్నారు. కాగా నియోజకవర్గంలో 136 మంది సిబ్బంది అవసరం కాగా 52 మందిమే విధులు నిర్వర్తిస్తున్నామని, సిబ్బంది కొరతతో సేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు ఎమ్మెల్యేకు చెప్పారు. త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీఈలు సత్యనారాయణ, రవీందర్, ఏఈలు రమేష్‌గౌడ్, శ్రీధర్, ఈశ్వర్, షణ్ముఖ్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లు మంజూరు చేయించండి

షాద్‌నగర్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను తీర్చాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీని ఎమ్మెల్యే శంకర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎండీకి వినతిపత్రం ఇచ్చారు. అదనంగా సబ్‌స్టేషన్ల ఏర్పాట్లు, సిబ్బంది కొరత, నిధుల కేటాయింపు వంటి సమస్యలపై చెప్పారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

జిల్లా స్థాయి సీఎం కప్-2024లో గెలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే శంకర్ సత్కరించారు. క్యాంప్ కార్యాలయంలో పరుగు పందెంలో ప్రతిభ కనబర్చిన కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ జెడ్పీ స్కూల్‌కు చెందిన అక్షిత, వర్షిత, నిహారికను అభినందించారు. మండలం ఎంపీడీవో రవిచంద్రరెడ్డి, స్పెషలాఫీసర్ రాజారత్నం, ఎంఈవో చంద్రశేఖర్, హెచ్‌ఎం శ్రీశైలం, ఆనంద్‌బాబు, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి, భారత మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు వర్ధంతిని సోమవారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో నిర్వహించారు. కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కడ్తాల్, తలకొండపల్లిల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి పాల్గొన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలుకు పి.వి చేసి కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, బిక్య, రామకృష్ణ, సంపత్ పాల్గొన్నారు.

ప్రతిభాపాటవ పోటీలతో ఉత్సాహం

యాచారం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో వివిధ సబ్జెక్టులపై ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తే విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని యాచారం హైస్కూల్ హెచ్‌ఎం నర్సింహ చెప్పారు. పదోతరగతి విద్యార్థులకు సోమవారం ప్రతిభాపాటవ పోటీపరీక్షల ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. విజేతలైన విద్యార్థులను అభినందించారు.

పంటల బీమా స్కీంలను సద్వినియోగం చేసుకోవాలి

లీడ్ బ్యాంక్ జిల్లా అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పంటల బీమా పథకాలను రైతులు వినియోగించుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా అధికారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, సతీశ్ పిలుపునిచ్చారు. సోమవారం శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేట గ్రామంలో మండల వ్యవసాయాధికారి రమేశ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అర్హులైన రైతులకు వ్యవసాయ పంట రుణాలను, వ్యవసాయ పనిముట్లను జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు, కెనరా బ్యాంకు శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పట్టా భూములను కలిగి ఉండి సాగు చేస్తున్న రైతులు పంటల బీమా కోసం, అలాగే ప్రమాదవశాత్తు ఆర్థిక సాయం కింద రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని వివరించారు. కెనరా బ్యాంక్ శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సాగర్ మాట్లాడుతూ సైబర్ మోసాలపట్ల నష్టపోకుండా ఉండేందుకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శామీర్‌పేట సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రైతులకు, ప్రజలకు వివిధ పథకాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు జ్యోతి, శ్రీకాంత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

శామీర్‌పేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం క్రమశిక్షణతో చదివి టెన్త్ పరీక్షల్లో ర్యాంకులను సాధించాలని మాజీ జేడీ లక్ష్మీనారాయణ హితవు చెప్పారు. తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ట్రస్మా, ఐఎంసీటీఎఫ్, శ్రీవిజ్ఞానభారతి హైస్కూల్ కరస్పాండెంట్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు మెచ్చుకునేలా, సమాజం గర్వపడేలా తయారు కావాలన్నారు. అప్పుడే అత్యుత్తమ పౌరులుగా రాణిస్తారని ఆయన హితవు పలికారు. సోషల్ మీడియా యాప్స్‌కు విద్యార్థులు దూరంగా ఉంటూ పూర్తి శ్రద్ధతో టెన్త్ పరీక్షలకు సిద్ధమై రాస్తే ఉత్తమ ర్యాంకులను సాధించగలుగుతారని వివరించారు. కార్యక్రమంలో ఐఎంసీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాములు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ జంగారెడ్డి కిష్టారెడ్డి, లవకుమార్, శివశంకర్, స్వరూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆలూరు గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలూరు గ్రామాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే యాదయ్యను కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆలూరుకు చెందిన నాయకులు కె.నర్సింలు, జి. ఆశోక్, కసిరె వెంకటేశ్, తోట చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. చేవెళ్ల మండలంలోని ఆలూరు గ్రామాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేవెళ్లను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిందని, ఆలూరు చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలుపుతూ ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం గ్రామంలో 1,200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, కుమార్, శ్రీనివాస్, శ్రీశైలం, నరేందర్, యాదిరెడ్డి, షబ్బీర్, శేఖర్, నర్సింలు ఉన్నారు.

సీపీఐది అలుపెరుగని పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జంగయ్య, తదితరులు

మహేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో సీపీఐది అలుపెరుగని పోరాటమని, నిత్యం ప్రజా పోరాటాలతో 99 సంవత్సరాలు పూర్తిచేసుకొని శత వసంతంలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. ఈమేరకు సోమవారం మహేశ్వరంలో శత వసంతోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి జంగయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దత్తునాయక్, యాదయ్య, దేవేందర్‌గౌడ్, బ్రహ్మచారి, సత్తయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలో పేదల సంక్షేమ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. 149 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కడ్తాల మండలం నాగిరెడ్డిగూడ తండా నుంచి మక్తమాదారం వరకు రూ.12కోట్లతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ పాలనలో అప్పుల మూలాంగానే కాంగ్రెస్ కొన్ని పథకాలను చేయడంలో కొంత జాప్యమైతోందన్నారు. ప్రతీ హామీని అమలు చేసేలా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆమనగల్లులో మోడల్ ఇళ్ల నిర్మాణంలో జాప్యమైతోందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి 4,500 ఇళ్లు మంజూరయ్యాయని, ఇల్లు లేని ప్రతీ పేదకు ఇల్లు కట్టిస్తామన్నారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, తహసీల్దార్లు లలిత, ముంతాజ్, నాగార్జున, మున్సిపల్ కమిషనర్ వసంత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వై.నర్సింహ, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, జి.కేశవరెడ్డి, ఎంపీడీవోలు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్చిల రూపురేఖలు మారుస్తాం



ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్‌తో కలిసి ప్రార్థన చేస్తున్న పాస్టర్ జనార్దన్

తాండూరు రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శిలావస్థలో ఉన్న చర్చిలన్నింటినీ రాబోయే రోజుల్లో రూపురేఖలు మార్చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన క్రైస్తవులతో సోమవారం తాండూరు పట్టణ సమీపంలోని వైట్ ప్యాలెస్‌లో క్రిస్టియన్ మైనార్టీస్ నియోజకవర్గం అధ్యక్షుడు వి.కిరణ్ ఆధ్వర్యంలో క్రైస్తవుల విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి ప్రసంగించారు. నియోజకవర్గంలో రూ.25కోట్లు వెచ్చించి అన్ని చర్చిలను నిర్మించి అభివృద్ధి చేసే బాధ్యత మాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అంకుశాపూర్‌లోని గురుకుల మహిళాడిగ్రీ కళాశాల(మహేంద్ర హిల్స్) సత్తాచాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ 10కిలోమీటర్ల విభాగంలో అనూష 5వస్థానం, చైతన్య 8వ స్థానం, బేబీ 9వ స్థానం, సోనీ 20వ స్థానం సాధించారు. 6 కిలోమీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో ఉషారాణి 5వ స్థానం, టాబు 7వ స్థానం, జి.ఉషారాణి 8వ స్థానం, సలోని 23వ స్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రిన్సిపల్ స్నేహలతతో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు స్వరూపరాణి, అనురాధ, జ్యోతి, శివకుమార్, వసంత, పద్మజ, రజిత, ప్రత్యూష, శిరీష, రమ్య, లక్ష్మి, సుప్రియ, సుమలత, అథ్లెటిక్స్ కోచ్ బిక్షపతియాదవ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

బొంరాస్‌పేట్: సీఎం కప్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బొంరాస్‌పేట్ మండల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో బొంరాస్‌పేట్ మండల క్రీడాకారులు నర్సింహులు, శ్రీశైలం, అశోక్, మహేశ్, ప్రభాకర్, గంగాధర్, మల్లేశ్, రాహుల్, అఖిలేశ్, రాఘవేందర్, ప్రవీణ్, మహబూబ్‌లు మొదటి స్థానంలో నిలిచారు. వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించే పశుసంచార వామన సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామంటూ మేడ్చల్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వని కారణంగా పూట గడవటం కష్ట తరంగా మారిందని వారు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు వేతనాలు అందజేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

దోమ/కులకచర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులును సోమవారం మండల కేంద్రంలో ఏబీబీఎస్ జిల్లా సేవాలాల్ సేన కుల్దీప్‌సింగ్, మండల యూత్ అధ్యక్షుడు జంగయ్య శాలువాతో సన్మానించారు.

ధ్యానంతో ఆత్మజ్ఞానం

(5వ పేజీ తరువాయి)

ధ్యాన విలువలను వివరించారు. ఈమేకు ఆదాయ పన్ను శాఖ అధికారి జైన్ వేడుకలకు హాజరై ధ్యాన విస్తరణకు చేస్తున్న కృషిని అభినందించారు. పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, హన్మంతరావు, మాధవి, దామోదర్‌రెడ్డి, లక్ష్మి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, పీఎస్ఎస్ఎం అధ్యక్షులు సరోజ, తదితరులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానమహాయగంలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి. ఆధ్యాత్మిక వేత్తల ప్రసంగాలు ఆకట్టుకుంటున్నాయి. ధ్యాన, శాఖాహార విలువల గురించి పలువురు పిరమిడ్ మాస్టర్లు ధ్యాన వేడుకల్లో వివరించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు పిరమిడ్‌ను సందర్శించి ధ్యాన మహాయాగంలో పాల్గొన్నారు. పలు ప్రాంతాల కల్చరల్, అకాడమీలకు చెందిన కళాకారుల నృత్యాలు, కళాప్రదర్శనలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు, యువతులు, కళాకారుల నృత్యరూపకాలు, భరత నాట్యాలు, కూచిపూడి నృత్యాలు అదరహో అనిపించాయి. కామాక్షి బృందంచే నిర్వహించిన సంగీత కార్యక్రమం అలరించింది.



ఆకట్టుకున్న సంజయ్‌కింగ్ సంగీతనాద ధ్యానం



ధ్యాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు

పలు పుస్తకాల ఆవిష్కరణ

ధ్యాన మహాయాగంలో భాగంగా పిరమిడ్ సభా ప్రాంగణంలో పలు ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్వోలు విజయభాస్కర్ రెడ్డి, పత్రీజీ కూతురు పరిణీత పత్రిజీ ఆవిష్కరించారు. ధ్యాన విలువలను చాటుతూ పుస్తకాలను వెలువరిస్తున్న రచయితలను ఈ సందర్భంగా వారు అభినందించారు. అదేవిధంగా పలు ధ్యాన కేంద్రాల ద్వారా రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

రెస్టారెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



రంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత యువకులు

పూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ తినేందుకు వెళ్లిన తమను రెస్టారెంట్ యజమానులు చితకబాదారని, సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి చేవెళ్ల మండలం ఘనాపూర్ గ్రామానికి చెందిన బాధిత యువకులు ఎం.మహేందర్, శంకర్, నాగరాజు, సురేష్‌లు ఆదివారం మధ్యాహ్నం పూడూరు మండల పరిధిలోని చిట్టెంపల్లి గేటు సమీపంలో గల నక్షత్ర రెస్టారెంట్‌కు బిర్యానీ తినేందుకు వెళ్లారు. వారికి తీసుకొచ్చిన బిర్యానీలో డిష్‌లు తోమే స్క్రబ్బర్ ఇనుప చువ్వలు రాగా రెస్టారెంట్ యజమాని మాణిక్యరావు(మేషక్)కు చెప్తే దాడికి పాల్పడినట్లు వాపోయారు. మాణిక్యంతో పాటు సిబ్బంది దాదాపు 15మంది మూకుమ్మడి మాపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంబడించి మరీ తమను గరిటెలు, ఇనుప రాడ్లు, కేబుల్ వైర్లు, కర్రలతో తమను చితకబాదారని కలెక్టర్ ఎదుట వారికి తగిలిన గాయాలను చూపించారు. నక్షత్ర రెస్టారెంట్ నాసిరకమైన భోజనం పెడుతూ కస్టమర్లతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అలాంటి రెస్టారెంట్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్, అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బాలాజీ ఆస్పత్రి ఎదుట ఆందోళన



పరిగిలోని బాలాజీ ఆస్పత్రిలో స్థానికుల వాగ్వాదం

పరిగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని బాలాజీ ఆస్పత్రిలో డాక్టర్ల తీరుపై రోగుల బంధువులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు పరిగి పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. దోమ మండలం దిర్సంపల్లి గ్రామానికి చెందిన చాకలి మహేశ్వరి, భీమయ్య దంపతుల ఆరేళ్ల కూతురు ఆరోగ్యం బాగా లేదని రెండేళ్ల నుంచి పరిగిలోని శ్రీబాలాజీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. రెండేళ్లుగా ఏలాంటి పరీక్షలు చేయించకుండానే చికిత్సలు చేస్తున్నారు. ప్రతీసారి రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తోట జ్వరం వస్తోందని, ప్రతీ పది రోజులకోసారి చికిత్సలు చేస్తూ డబ్బులు తీసుకున్నారని వాపోయారు. చివరగా చేతులేత్తేసి పాపకు సీరియస్‌గా ఉందని, ఎక్కడికైనా తీసుకెళ్లాలని చెప్పడంతో దీంతో నగరంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తీసుకెళితే గుండెలో నాలుగు ఛాంబర్స్‌డ్యామేట్ అయ్యాయని చెప్పడంతో పాప బంధువులు సోమవారం పరిగిలోని బాలాజీ అస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను నిలదీశారు. డాక్టర్ తీరుపై నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం పరిగి పీఎ‌స్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా దోమ మండల కేంద్రానికి చెందిన యువతి కూడా వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిన విషయం తెలిసిందే.

రైతులను ఆదుకోవాలి



ఘట్‌కేసర్ రూరల్: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : దేశానికి అన్నం పెట్టె రైతులను ఆదుకోవాలని అనురాగ్ వ్యవసాయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పన్నాల దివాకర్‌రెడ్డి తెలిపారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా అవుషాపూర్, జమిలాపేట్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌రెడ్డి, ఐశ్వర్య, పార్వతి విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా తాండూరు మండలం ఐనెల్లి గ్రామ శివారులోని ఆదర్శ కళాశాల పాఠశాలలో విద్యార్థులు రైతుల వేషాధారణలో రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీదేవి అభినందించారు.

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా రైతులను సన్మానించారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సామా వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శివప్రసాద్, ఎక్బాల్, శ్రీనివాస్‌రెడ్డి, తలారి శేఖర్, శ్రీధర్, తలారి రాజు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- 20 ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్‌లో సేవలు
- రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలి
- 29న నిర్వహించే పరీక్షను రద్దు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలి
- డిమాండ్ల సాధనకు పోరుబాట

'మేము అధికారంలోకి వచ్చాక మీ సమస్యలను పరిష్కరిస్తాం. ఈ ప్రభుత్వం త్వరలో పోతుంది. (బీఆర్ఎస్‌ను ఉద్దేశించి) మీకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. అధికారంలోకి వచ్చాక మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. మీరు బాధపడకండి. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే, మిమల్ని రెగ్యులరైజ్ చేసే బాధ్యత మాదే'

-తాండూరులో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి మాటలు



తాండూరు సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

తాండూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్‌డీ ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం 19వ తేదీ నుంచి పోరుబాట పట్టారు. ఇందుకోసం 29న నిర్వహించనున్న ఎంపీహెచ్ఏ(ఎఫ్) రాత పరీక్షను నిలిపి వేయాలని వైద్యారోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది. 20 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. వీరంతా 46 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వారని, వారు పోటీ పరీక్ష రాసే పరిస్థితి లేనందున రాత పరీక్ష లేకుండా సర్వీసులను క్రమబద్ధీకరించాలని చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ చర్చలు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేసి న్యాయం చేయలని ఏఎన్ఎంలు, సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంపై ఆశాభావం

టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి 2023 ఆగస్టు 24న ప్రచారంలో భాగంగా తాండూరు పట్టణానికి వచ్చారు. అప్పటికి సమ్మెలో ఉన్న ఏఎన్ఎంలు కాంగ్రెస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం వద్దకు వచ్చి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రేవంత్‌రెడ్డికి అందజేస్తూ తమను అదుకుంటే పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. తప్పకుండా అధికారంలోకి వచ్చాక ఆదుకుంటామని , ఎన్ఎంల డిమాండ్లు పరిష్కరిస్తామని, రెగ్యులైజేషన్ చేస్తామని ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చిన విషయాన్ని ఏఎన్ఎంలు నేడు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సీఎం అయినందున తమ డిమాండ్లు నెరవేరుతాయని ఏఎన్ఎంలు ఆశిస్తున్నారు.

తోడేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

సమకూరుస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. పరిగి మండలం రంగాపూర్, నజీరాబాద్, రూప్‌ఖాన్‌పేగ్, ఇబ్రహీంపూర్, రంగంపల్లి, తుంకులగడ్డ, సుల్తాన్‌పూర్, జాఫర్‌పల్లి, సయ్యద్‌మల్కాపూర్, ఖుదావంద్‌పూర్, రాఘవాపూర్‌లలో అక్రమంగా మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారుల కళ్లముందే ఈ తతంగం జరుగుతున్నా తమకేందుకులే అన్నట్లు వ్యహరిస్తుండటం గమనార్హం.

మాముళ్ల మత్తులో అధికారులు!

అసైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్న విషయాలను స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. ఫిర్యాదు చేస్తే అక్కడికి వెళ్లే రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కొద్దిసేపు అక్కడ హడావుడి చేసి మట్టి వ్యాపారుల దగ్గర మామూళ్లు తీసుకొని అక్కడ ఉన్న జేసీబీ, ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించి వేసి సమాచారం ఇచ్చిన వారికి ఫోన్ చేసి అక్కడ ఎవరూ లేరే? మీరు ఎప్పుడు చుశారు? అంటూ సమాచారం ఇచ్చిన వారినే ఎదురు ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా మట్టి తవ్వకందారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతలే అధికం!

ఈ మట్టిదందాలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల పాత్ర ఉన్నట్లు తెలుస్తున్నది. అధికార పార్టీ నాయకులైతే మమ్మల్ని ఎవరూ అడ్డుకుంటారనే ధీమాతో వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమ మట్టి దందా పంచాయితీ పోలీసుల వద్దనే జరుగుతుందటే ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. మట్టి దందా అధికార పార్టీ నాయకులే ఎక్కువగా నడిపిస్తున్నారు. మట్టి వ్యాపారులు ఇచ్చే డబ్బులతో అధికారులు కూడా చూసినడనట్లుగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారంలో ఒకరిపైఒకరు గిట్టని వారు అధికారులు పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఆ తర్వాత తిరిగి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్న పరిస్థితి. మట్టి దందా పంచాయితీలను ప్రభుత్వ అధికారులు దగ్గర ఉండి సెటిల్‌మెంట్లు చేస్తుండడం గమనార్హం.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె న్యాయమైనది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె న్యాయమైనదని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సర్వశిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మెలో సోమవారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, కృష్ణ, రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, మాజీ సర్పంచుల సంఘం వికారాబాద్ మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, నాయకులు సత్తయ్యగౌడ్, ఘాయాజ్, గఫ్ఫార్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మోమిన్‌పేట్ మండల తపాస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మధుకర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో మగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్, వెంకటేశం, మహేందర్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే

మోమిన్‌పేట్: చక్రంపల్లిలో శ్రీ భ్రమరాంభ సహిత మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దబ్బాని వెంకట్, మర్పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, నారాయణగౌడ్, మానెయ్య, అనంతరెడ్డి ఉన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

నవాబుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైంది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి సోమవారం అధికారులు హాజరైనా దరఖాస్తులు అందించేందుకు ఎవరూ రాలేదు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ శ్రీలత, ఏపీఎం మంజులవాణి పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గంలో అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి వినూత్న నిరసన చేపట్టారు. సోమవారం రైతులతో కలిసి ట్రాక్టర్‌పై కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించి వినతి అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ పోచిరెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీటట వేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని పరిగిలోని చర్చిలో సోమవారం కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అన్ని వర్గాలకు సమప్రాధాన్యత ఇస్తుందన్నారు. చర్చిల మరమ్మతుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, హన్మంత్‌ముదిరాజ్, ఇ.కృష్ణ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ సుధాకర్‌కు క్రైస్తవ సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశ డానియల్ విలియం, ఆర్. కుమార్, రెవరెండ్ దయానంద్, మార్క్, డాక్టర్ స్టీవెన్, గాబ్రియల్, జాన్ విక్టర్, వసంత, రోజా, వెంకట్, ప్రభు, పద్మారావు, చంద్రకాంత్, నర్సింహులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో..

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు విద్యార్థులు అధ్యాపకులు, కలిసి ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ పాటలతో అందరినీ అలరించి కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల బోనాలు

నవాబుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) నారేగూడ గ్రామంలో సోమవారం మైసమ్మ, ఈదమ్మ బోనాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల నిర్మించిన మైసమ్మ, ఈదమ్మ ఆలయాల ప్రారంభోత్సవం, గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మహిళలు పెద్దఎత్తున బోనాలతో చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పర్మయ్య, తిరుపతి రెడ్డి, రఘునందన్‌రెడ్డి, నాగిరెడ్డి, మైపాల్‌రెడ్డి, అనంతయ్య, హన్మయ్య, శివరాజ్, శేఖర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మర్పల్లి/మేడ్చల్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు మర్పల్లి, మేడ్చల్ పరిధిలో చోటుచేసుకున్నారు. అడవిపందిని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కోటమర్పల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కోటమర్పల్లికి చెందిన కావలి నాగేశ్(30), తుల్జరాం ఇద్దరు కలిసి ఆదివారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సొంత గ్రామానికి వెళ్తుండగా కోటమర్పల్లి శివారులో అడవిపంది అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా రావడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డికి తరలించారు. చికిత్స పొందుతూ నాగేశ్ మృతిచెందగా తుల్జరాం చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరో ప్రమాదంలో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఓయువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మండలంలోని రాయిలాపూర్ నుంచి మధు(33) అనే యువకుడు శ్రీరంగవరం బైక్‌పై వెళ్తుండగా రాయిలాపూర్ శివార్లలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. తీవ్రగాయాలపాలైన మధు స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టే లోపే ప్రాణాలు కోల్పోయాడు. కాగా క్రషర్ల నుంచి కంకర తరలించే లారీల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపై కంకర పడటంతో బైక్‌జారి ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుంటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి యువకుడు..

ధారూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చేపల పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు చేపల కోసం వేసిన వలకు చిక్కుకుని నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మైలారం కొత్త తండాలో ఆదివారం చోటుచేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్త తండాకు చెందిన విక్రమ్(25) ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు సమీపంలోని చింతకుంట గచ్చుకత్వకు వెళ్తున్నట్లు తండ్రి సీతారాంకు చెప్పి వెళ్లాడు. చేపల కోసం గచ్చుకత్వలో వలలు వేస్తుండగా ఓవల విక్రమ్ కాళ్లకు చుట్టుకుంది. వలను తొలగించే ప్రయత్నంలో వల కాళ్లను చేట్టేయడంతో కత్వ నీటిలో మునిగి మృతిచెందాడు. విక్రమ్ ఇంటికి రాకపోయేసరికి అనుమానం వచ్చిన తండ్రి సీతారాంకత్వ వద్దకు వెళ్లి కత్వ నీటిలో ఉన్న వలలను బయటకు తీస్తుండగా వలతో పాటు కుమారుడు విక్రమ్ మృతదేహం కనిపించింది. స్థానికుల సాయంతో నీటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

బావిలో దూకి ఆశావర్కర్ ఆత్మహత్య

నవాబుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితులు బాగా లేక ఆశావర్కర్ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నవాబుపేట మండలంలో జరిగింది. గ్రామస్థులు, ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిట్టిగిద్ద గ్రామానికి చెందిన అనిత(48) గ్రామంలో గత 13సంవత్సరాలుగా ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. తన కూతురు స్వాతికి వివాహం చేసిన అనంతరం రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందడంతో తల్లి దగ్గర ఉంటోంది. భర్త మృతి చెందడంతో కూతురు స్వాతికి తిరిగి వివాహం చేయలేక ఆదివారం అర్ధరాత్రి కూతురికి న్యాయం చేయలేకపోతున్నాని ఫోన్ ద్వారా మెసేజ్ పంపించి గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తన తల్లికి ఫోన్ చేసిన స్వాతి తెలిసిన వారు, బంధువుల దగ్గర ఆచూకీ కోసం వెతికింది. మెసేజ్ ఆధారంగా గ్రామ శివారులోని బావి దగ్గరికి వెళ్లి చూడగా బావిలో ఆమె మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఆశా వర్కర్ అనిత మృతికి భర్త శ్యామ్ కారణమై ఉంటాడని గ్రామంలో గుసగుసలు వినిపించాయి.

కుక్కల దాడిలో మేకలు, గొర్రెలు మృత్యువాత

పెద్దేముల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మేకలు, గొర్రెపిల్లలపై కుక్కలు దాడిచేశాయి. కుక్కల దాడిలో 5మేకపిల్లలు, 2గొర్రెపిల్లలు మృతి చెందాయి. ఈసంఘటన పెద్దేముల్ మండల పరిధిలోని గాజీపూర్ గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన బుద్దారం లక్ష్మప్పకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటిని మేతకు తీసుకువెల్లే సమయంలో వాటికి జన్మించిన చిన్నిచిన్న మేకలు, గొర్రెలపిల్లలను ఇంటి వద్ద జాలిలో వదిలి వెలుతారు. ఇంటివద్ద దొడ్డిగా ఏర్పాటుచేసి చుట్టూ ఇనుపకంచె ఏర్పాటు చేసినా అందులోకి సోమవారం కుక్కలు దూరాయి. మేకపిల్లలు, గొర్రెపిల్లలపై దాడిచేసి కరిచి చంపేశాయి. కుక్కల దాడిలో 5మేకపిల్లలు, 2గొర్రెపిల్లలు మృతి చెందాయి. అది గమనించిన లక్ష్మప్ప కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నిరుపేదలమైన తాము మేకలు, గొర్రెలను పెంచుతూ తాము జీవనోపాధి పొందుతున్నామని, గొర్రెపిల్లలు, మేకపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందినందున ప్రభుత్వం తమకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

కులకచర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామ పంచాయతీ శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. వేపూర్ గ్రామానికి చెందిన అంజి అనే వ్యక్తి కారులో మహబూబ్‌నగర్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు అంతారం శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అంజి స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీ

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, జోడిమెట్లకు చెందిన బి.శ్రీవాత్స ఈనెల 19 రాత్రి తన ఇంటి ముందు యాక్టీవా (టీఎస్ 21 ఎఫ్ 7569)ను పార్కుచేశాడు. మరుసటిరోజు లేచి చూసేసరికి యాక్టివా కనిపించలేదు. పరిసరాల్లో, తెలిసిన వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం 51 మంది లబ్ధిదారులకు రూ.51 లక్షల 5వేల 916 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ అధ్యక్షతన అర్హులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రాంరెడ్డి, మాధవరెడ్డి, అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవకుండా చదవాలని జీఎస్టీ శాఖ అసిస్టెంట్ కమిషనర్ దేవేందర్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్ విభ ఇంటర్నేషనల్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటివేషన్ స్పీకర్ వీవీ రమణ, ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, పాఠశాల కార్యదర్శి విష్ణుమూర్తి, డైరెక్టర్ విజయ భారతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

వికారాబాద్: క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డిలు అన్నారు. పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో సోమవారం సీఎం కప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 27వ తేదీన రాష్ట్ర స్థాయిలో జరిగే సీఎం కప్ పోటీలకు పంపనున్నట్లు చైర్ పర్సన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముక్తహర్ షరీఫ్ పాల్గొన్నారు.

ఇంటర్‌నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ

పూడూరు: ఇంటర్‌నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఆదివారం షాద్‌నగర్‌లో జరిగాయి. ఈ టోర్నమెంట్‌లో పూడూరు మండలం నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బ్లాక్ బెల్ట్ పోటీల్లో మండలానికి చెందిన వైష్ణవి ముదిరాజ్ గ్రాంట్ ఛాంపియన్‌గా గెలుపొందింది. మండలానికి చెందిన విఘ్నేష్, అభినవ్, శ్రీశాంత్, అక్షిత, సందీప్ తదితరులు గెలుపొందారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ బి.బాల్‌రాజ్ సంప్రదాయ జపాన్ షోటోకన్ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు శ్రీనివాస్, మాస్టర్లు విద్యార్థులను అభినందించారు.

పీవీ సేవలు మరువలేనివి

శామీర్‌పేట: దేశ ప్రజలకు ప్రధానమంత్రిగా ఉత్తమ సేవలందించిన పీవీ నరసింహారావు సేవలు మరువలేనివని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని అంతాయిపల్లిలో సోమవారం దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నర్సింలుయాదవ్, జైపాల్‌రెడ్డి, బాలేష్, వేణుగోపాల్‌రెడ్డి, యాస్కి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాల్సిందే

మేడ్చల్ ప్రతినిధి: రాజ్యాంగంపై దాడి చేయడంలో భాగంగానే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై ఉద్దేశ్యపూర్వకంగానే కించపరిచే విధంగా వాఖ్యానించాడని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. తూంకుంట జిల్లా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిలతో కలిసి సమావేశం నిర్వహించారు.

ప్రజారక్షణే పోలీసుల లక్ష్యం

బషీరాబాద్: ప్రజల రక్షణ బాధ్యత పోలీసుల లక్ష్యమని బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ అన్నారు.మండలంలోని మల్కన్‌గిరి, రెడ్డిఘణాపూర్, మంతట్టి గ్రామాల్లో సోమవారం విలేజ్ విజిట్‌లో భాగంగా ఆయన పర్యటించారు.అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వస్తే 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఘనంగా సింగరేణి డే

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల సుప్రబాత్ టౌన్‌షిప్‌లో సోమవారం సింగరేణిడే వేడుకలను సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సింగరేణి 136 అవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు, బానయ్య, వేణుమాధవ్, రాజయ్య, బీరయ్య, ఉమాకార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి సోమవారం డీసీసీబీ చైర్మన్ సత్తయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

కీసర: విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించాలని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మజా అన్నారు. రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీరోడ్లు నిర్మించేందుకు 160మీటర్లకు గాను రూ.8లక్షలు మంజూరయ్యాయి. అట్టి పనులకు ఈనెల 6న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయగా సోమవారం గ్రామానికి చెందిన ఉప్పరి నర్సింహులు పనులను ప్రారంభించారు.

కీసరలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

కీసర: కీసరలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యకుడు నల్లా వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆధార్ నమోదు చేసుకోవడానికి, తప్పొప్పులు సవరించేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందని తెలిపారు. కొన్ని ఆధార్ కేంద్రాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

వికారాబాద్: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని బచ్‌పన్ పాఠశాలలో విద్యార్థులతో గణిత బోధనపై సులువైన మార్గాలు సూచించే విభిన్న కాన్సెప్ట్‌లతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి విద్యార్థుల ప్రదర్శనను సందర్శించి అభినందించారు. ఈ వేడుకల్లో డైరెక్టర్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ శ్వేతా ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.